సీసీ కెమెరాల ఏర్పాటుకు విశాఖ పోలీసు కమిషనర్‌కు వినతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ : పెద గంట్యాడ పరిసర ప్రాంతాల ప్రజలు ఎక్కువగా వినియోగించుకుంటున్న పార్కుల వద్ద ఆట స్థలాల వద్ద ముఖ్య కూడలల్లో, అలాగే పాఠశాల, దేవాలయాల పరిసరాలలో ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయ వలసిందిగా విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఈ రోజు విశాఖ నగర కమిషనర్ శ్రీ శంఖబత్ర భాగ్చే కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టీడీపీ నాయకులు ములకలపల్లి పెంటారావు, పులి సురేష రెడ్డి (బాబీ), మొల్లి అప్పారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ సీపీఐకే సాధ్యం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం : ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ సిపిఐకే సాధ్యమని ఏఐటియూసి జాతీయ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ స్పష్టం చేసారు. ఉక్కు నగరం సెక్టార్ ఎ 1 షాపింగ్ కాంప్లెక్స్ వద్ద శనివారం సీపీఐ శత వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. సీపీఐ పతాకాన్ని ఆదినారాయణ ఆవిష్కరించారు . అనంతరం ఆయన మాట్లాడుతూ 1925 అక్టోబర్ 26 న కాన్పూర్ నగరంలో సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని, సీపీఐ పార్టీ ఏర్పాటై వందేళ్లు అయ్యిందని, దేశ వ్యాప్తంగా సీపీఐ శత వార్షికోత్సవ వేడుకలు జరుపు కుంటున్న దని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణ, బడుగు, బలహీన వర్గాల హక్కులకోసం సిపిఐ పోరాడుతున్న దని అన్నారు. గత వందేళ్లుగా సీపీఐ ప్రజా పోరాటాల్లో అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ఉక్కు కర్మాగారం నేడు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, ఈ ఇబ్బందులకు కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. ఉక్కు నగరం శాఖ సిపిఐ కార్యదర్శి తాండ్ర కనక రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్ ఏ.ఐటియూసి అధ్యక్షులు కె.ఎస్ఎన్.రావు, అదనపు ప్రధాన కార్యదర్శి జె.రామకృష్ణ, కె.రాజబాబు, జి.ఆనంద్, ఏ.ఐటియూసి పూర్వ అధ్యక్షులు జి.బోసుబాబు, ఎస్.మోహన్ బాబు, బి.ఎంఎల్.నాయుడు, ఎన్.ఎస్‌పి రావు, గోవింద్ పాల్గొన్నారు.

కొమ్మాది : మధురవాడ శివశక్తి నగర్ ఏరియాలో సీనియర్ నాయకులు బి.కేశవయ్యజెండా ఎగరవేశారు భారత కమ్యూనిస్టు పార్టీ 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 వా సంవత్సరం లోకి అడుగు పెడుతుంది మనం మన ప్రియమైన కమ్యూనిస్టు పార్టీ శత వార్షికోత్సవం జరుపుకోబోతు నామ్ భారత స్వతంత్ర ఉద్యమాల్లో ఆ తర్వాత దేశ ప్రజల సామూహిక రాజకీయ ఆర్థిక హక్కుల కోసం పోరాటాలు నడిపింది మన పార్టీ ప్రపంచంలో నీ ఇతర కమ్యూనిస్టు పార్టీలు లాగే 1917లో రష్యాలో జరిగిన మహా విప్లవం స్ఫూర్తితో ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మించుకున్నాం

1925 కు ముందు కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసుకోవడానికి విదేశాలలో కొన్ని ప్రయత్నాలు జరిగాయి అయితే విస్తృతం లేదని విప్లవ కారులైన యువకులు ఈ ప్రయత్నాలు చేశారు కానీ అవి విజయవంతం కానందున 1925 డిసెంబర్ 26న పార్టీ స్థాపించబడింది అప్పటినుంచి పేద ప్రజల పక్షాన కార్మికుల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూ ముందుకు సాగుతుంది భారత కమ్యూనిస్టు పార్టీ. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా సిపిఐ పార్టీ కార్యదర్శి వి సత్యనారాయణ ఏరియా పార్టీ నాయకులు ఎంఏబేగం ఎం సన్నిపాత్రుడు బి ప్రసాద్ బి నారాయణమ్మ అన్నాజీ రావు ఫాతిమా తదితర నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలిపిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : శాసన మండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ , మాజీ పార్లమెంట్ సభ్యురాలు బొత్స ఝాన్సీ, జిల్లా పార్టీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా బొత్స సత్య నారాయణ మాట్లాడుతూ దేశం గొప్ప నేతను కోల్పో యిందన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. పనికి ఆహార పథకాన్ని తీసుకుని వచ్చి పేదల కడుపు నింపారు. రాజకీ యాలకు అతీతంగా దేశం కోసం పని చేసిన గొప్ప వ్యక్తి ఆయన మరణం దేశానికి తీరని లోటన్నారు. మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ మాట్లాడుతూ దేశ చిత్రపటాన్ని ప్రపంచంలో నిలుపుని వ్యక్తి మన్మోహన్ సింగ్. సంస్కరణల వారధి మన్మోహన్ సింగ్. ఆయన మరణం దేశానికి తీరని లోటు. ఆయన సంస్కరణలు దేశానికి రాబోయే తరానికి ఎంతో ఉపయోగం అన్నారు. ఆయన దేశానికి సేవలు మరువలేము. స్టీల్ ప్లాంట్ విస్తరణకు ఎంతో కృషి చేశారు. వినాయక ప్రభుత్వ

రంగ సంస్థలు ప్రైవేటుపదం కాకుండా కాపాడాడు. నేను ఏ పార్టీ ఆయన సేవలను ఈ ప్రాంత ప్రజలు గుర్తు పెట్టుకుంటా రన్నారు. ఇండియాను గ్లోబల్ పవర్ గా చేసిన ఘనత మన్మోహన్ సింగ్ కు దక్కుతుంది.అనేక ఆర్థిక సంస్కరణలను ప్రవేశ పెట్టారు. ఆయన మరణం దేశానికి తీరని లోటుని, మన్మోహన్ సింగ్ గొప్ప దేశ భక్తుడన్నారు. దేశంలో విప్లవత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. దేశ అభివృద్ధి కోసం అనేక సంస్కరణలు తీసుకో వచ్చారు మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడే అణుఒప్పదం జరిగింది. గ్రామీణ దేశ ఆర్థిక వ్యవస్థను ఆయన తన సంస్కరణలతో మార్చా రన్నారు. జిల్లా పరిషతూ చైర్మన్ శ్రీమతి సుభద్ర, శాసనమండలి సభ్యులు కుంభ రవిబాబు, వందుల రవీంద్రబాబు, మాజీ శాసన సభ్యులు కరణం ధర్మశ్రీ, అన్నం రెడ్డి అదీప్ రాజ్, తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి చింతలపూడి వెంకట రామయ్య, శోభ హైమావతి, సమన్వయకర్తలు కేకే రాజు ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు పేడాడ రమణి కుమారి, చిన్న దాస్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్, కార్పొరేటర్లు కెల్లా సునీత సత్య నారాయణ, లావణ్య నాగరాజు, బి.ఫై.ఎస్ కుమార్ జైన్, చెన్న జనానికి రామ్, కోడి గుడ్ల పౌర్ణమి శ్రీధర్, అల్లు శంకర్ రావు, రెయ్యి వెంకట రామన్, బర్కత అలీ, పి.వి. సురేష్ కో ఆప్షన్ సభ్యులు ఎం.డి షరీఫ్ పార్టీ నాయకులు అల్లంపల్లి, రామన్న పాత్రుడు, మారుతీ ప్రసాద్, వానపల్లి ఈశ్వరరావు, పెంద్ర అప్పన, బోని శివ రామ కృష్ణ, జీలకర్ర నాగేంద్ర, మల్లేశ్వరి, దేవర కొండ మర్కదేయులు, తుళ్ళి చంద్ర శేఖర్, బెందాళం పద్మా వతి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఫిష్ కాన్ రాష్ట్ర సలహాదారుడుగా ఆవల రమేష్

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఫిష్ కాన్ రాష్ట్ర సలహాదారుడుగా ఆంధ్ర విశ్వ విద్యా లయ ఉద్యోగి ఆవల రమేష్ నియమితు లయ్యారు. ఈ మేరకు ఇటీవల విశాఖ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి మత్స్యకార సముదాయ సంఘాల నెట్వర్క్(ఫిష్ కాన్) సమావేశంలో విశాఖ జిల్లా ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన ఆవల రమేష్ ను ఎంపిక చేశారు. ఫిష్ కాన్ క్రియాశీలక సభ్యుల ఆమోదంతో రెండు సంవత్సరాలు కాలానికి గాను రాష్ట్ర స్థాయి సలహాదారుడిగా నియమించడం జరిగింది. సంస్థ నిర్వహించే మత్స్యకారులకు సంబంధించి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి చిన్న తరహా మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన సూచనలు సలహాలు తీసుకునేందుకు ఆవల రమేష్‌ను నియమించడం జరిగిందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు.

గంట్ల భరత్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 94 వ వార్డు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కీర్తిశేషులు గంట్ల భరత్‌కు, పెందుర్తి ఎమ్మెల్యే, జనసేన పార్టీ రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు ఘన నివాళులర్పించారు. శనివారం ఉదయం ఆయన అకాల మరణానికి చింతిస్తూ పెద్దకర్మ సందర్భంగా భరత్ చిత్ర పటానికి పుష్పాలు వేసి నివాళి అర్పించారు. స్థానిక కార్పొరేటర్ బల్ల శ్రీనివాస రావు, ఎన్‌డిఏ మహాకూటమి నాయకులు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పాఠశాల రక్షణ కవచం యాజమాన్య కమిటీలే : ఆర్.జే.డి విజయభాస్కర్

విశాలాంధ్ర - సింహాచలం : జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ శిక్షణా కార్యక్రమం, అడవివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ, యాజమాన్య కమిటీలు విధులు, అధికారాలు, సరియైన అవగాహనతో ఉన్న ఎడల పాఠశాల అభివృద్ధికి దోహద పడేటట్లుగా ఉంటుందని, ఆ దిశగా ప్రతి పాఠశాల ఎస్ఎంసి కమిటీలు కృషి చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన ఎస్ఎంసి సభ్యులు మరియు బృందం ,మండల స్థాయిలో శిక్షణను ఇవ్వాలని చెప్పారు. పాఠశాల స్థాయిలో చైర్మన్, సభ్యులు హోదాగా భావించకుండా, పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు కృషి చేయవలసిన బాధ్యత ఉందని తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రాంతీయ విద్యా

సంచాలకులు, బి.విజయభాస్కర్ మాట్లాడుతూ సమాజంలో బడి, గుడి, సమాన స్థాయిలో ఆదరించ బడాలని, అదే ఆదరణతో పాఠశాలను అభివృద్ధి చేసినట్లయితే సమాజ అవసరాలకు తగినట్లుగా భావి భారత పౌరులను తయారు చేయగలమని చెప్పారు. యాజమాన్య కమిటీలు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో, ప్రతి విద్యార్థి అందుకునేటట్లు చూడాలని ,తమ పరిధి మరియు ఆవాసంలో డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలని బడి ఈడు గల ప్రతి ఒక్కరిని పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ముఖ్యంగా బాలికల సంరక్షణకు, డ్రాప్ ఔట్ నివారణకు, కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు చెడు అలవాట్లకు గురి అవుతున్నారని, ఉపాధ్యాయులతో పాటు కమిటీ సభ్యులు కూడా సమాజ చైతన్య పరిచే విషయాలకు, కృషి చేయాలని అన్నారు .యాజమాన్య కమిటీలు అనేవి ఉత్సవ విగ్రహాల వలే కాకుండా నిరంతరం పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం వంటి ప్రాధాన్యత కలిగిన అంశాలలో ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడిరాజు, డి.సి.ఇ.బి సెక్రటరీ కృష్ణకుమార్, సి.ఎం. ఓ దేముడు బాబు, ఏపీఓ అప్పలనాయుడు, రిసోర్స్ పర్సన్స్, అన్ని మండలాల నుండి వచ్చిన ఎస్ఎంసి సభ్యులు పాల్గొన్నారు.

నితీశ్ కుమార్‌రెడ్డికి ఏసీఏ రూ. 25 లక్షల నగదు బహుమతి

విశాలాంధ్ర - పీఎం పాలేం : ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఆంధ్రకు చెందిన కుర్రాడు నితీశ్ కుమార్‌రెడ్డికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) రూ. 25 లక్షల నగదు బహుమతి ప్రకటించింది. ఆ మొత్తాన్ని త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందజేయనున్నట్లు ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు వెల్లడించారు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ నాలుగో టెస్టులో నితీశ్ కుమార్‌రెడ్డి అద్భుతంగా రాణిస్తుండటం అభినందనీయం అని వారు పేర్కొన్నారు. నేటి యువతకు నితీశ్ కుమార్‌రెడ్డి రోల్ మోడల్ అన్నారు. నితీశ్ కుమార్‌రెడ్డి భవిష్యత్తులో మరిన్ని పరుగులు సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని వారు ఆకాంక్షించారు.

విశాలాంధ్ర - కొమ్మాది : సీపీఐ 100 ఏళ్ల వారోత్సవాల్లో సందర్భంగా మారికవలస శాఖలో విశాలాంధ్ర ఎడిషన్ మేనేజర్ సనపల నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా జెండా వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా సీపీఐ కార్యదర్శి వి.సత్యనారాయణ, మహిళా సమైక్య నాయకురాలు ఎంఏ బేగం, సీనియర్ నాయకులు బి.కాస్పయ్య ఎం.సన్నిపాత్రుడు బి.ప్రసాద్ విశాలాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటాద్రిలో శ్రీనివాసునికి పంచామృత అభిషేకం

విశాలాంధ్ర - పెందుర్తి : ప్రఖ్యాత వైష్ణవ క్షేత్రం పెందుర్తి వెంకటాద్రిలో ధనుర్మాసఉత్సవాలు 13వ రోజు అత్యంత భక్తి ప్రపత్తులతో జరిగాయి. శనివారం ఉదయం స్వామివారిని మేల్కొల్పి, పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం తనయ విన్నపం చేసి హారతి చేశారు, సేవకాలం, శాత్తుమొరై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, 6 రకాల ప్రసాదాలు స్వామి వారికి నివేధన చేసారు. భక్తులకు తీర్థ గోష్ఠి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు మహార్తి రామనుజాచార్యులు తెలిపారు. ప్రతిరోజు సేవా కార్యక్రమాలు, కొండ దిగువ నుండి ఆలయం వరకు ఉచిత వాహన సదుపాయం ఉంటుందని తెలిపారు.

విశాఖలో ఏటి కాలేజీ పూర్వ విద్యార్థుల కలయిక

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖ నగరంలో మొట్టమొదటి ప్రైవేట్ పాఠశాల అయిన అన్నపూర్ణేశ్వరి ట్యుటోరియల్ కాలేజ్ 1998 ఎస్ ఎస్ సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక శనివారం ఉదయం బీచ్ రోడ్ లోని పార్క్ హోటల్ వేదికగా నిర్వహించారు. ఏటి కాలేజ్ పూర్వ విద్యార్థి ఐసిఎంఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏటి కాలేజ్ పూర్వ విద్యార్థి ఆంధ్రప్రదేశ్ విప్ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత చిన్ననాటి మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ఆనాడు తనతో చదువుకున్న వారిలో కొంతమంది అమెరికా ఆస్ట్రేలియా లండన్ వంటి ప్రదేశాల్లో స్థిరపడగా

మరికొందరు ప్రముఖ కార్పొరేట్ ఐటీ పరిశ్రమలు, పోలీస్ శాఖలలో ఉన్నత పదవుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం వేదికగా రానున్న రోజుల్లో పలు సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానాలు చేయనున్నామని ఆయన తెలిపారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ 1961లో దాబా గార్డెన్స్‌లో స్థాపించిన ఈ పాఠశాల విశాఖపట్నంలోనే మొదటి ప్రైవేటు టుటోరియల్ కాలేజీ అని అతి తక్కువ బోధనా రుసుముతో ఇంగ్లీష్ మీడియం విద్యను అందించారని గుర్తు చేశారు. తమతో పాటు చదువుకున్న వారంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడటం ఎంతో సంతోషించ దగ్గ విషయమని, దురదృష్టవసాత్తు స్కూల్ ప్రిన్సిపాల్ 2005లో మరణించడంతో ఈ స్కూల్ మూసి వేయడం జరిగిందని తెలిపారు. పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమానికి హాజరైన వైస్ ప్రిన్సిపాల్ దంపతులు ప్రసాద్ మాస్టారు, ఇతర ఉపాధ్యాయులు వరలక్ష్మి, సుబ్బారావు, ఎస్.లక్ష్మి బాలసత్యవతిలతో పాటు శాసనసభ్యులు బేదాళం అశోక్ కుమార్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చిట్టివలస కార్మికులకు బకాయిలు చెల్లించాలి

చిట్టివలస లేబర్ నాయకులు యూనియన్

విశాలాంధ్ర - విశాఖ : చిట్టివలస జూట్ మిల్లు యాజమాన్యం గత రెండేళ్లుగా కొంతమంది కార్మికులకు బకాయిపడిన పిఎఫ్, గ్రాడ్యుటీ, నష్ట పరిహారం, ఫిక్సడ్ డిపాజిట్లు చెల్లించాలని చిట్టివలస లేబర్ నాయకులు యూనియన్ (ఏఐటీయుసి) శనివారం నిర్వహించిన సమావేశంలో డిమాండ్ చేసారు. దీనిపై పిఎఫ్, కార్మిక శాఖ అధికారులను అనేకసార్లు కలిసామని, అయినా ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావుకి వినతిపత్రం ఇచ్చామని యాజమాన్యం, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి కార్మికులకు రావలసిన బకాయిలను ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, నూలు ఆదినారాయణ, అల్లు బాబురావు పాల్గొన్నారు.

వైసీపీ మూర్ఖులారా ధర్నాలు ఆపండి : జిల్లా టీడీపీ అధ్యక్షులు గండి బాబ్జి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఓటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలలే అయింది వైసిపి మూర్ఖులారా.. ఇప్పుడు అంత తొందరగా నిరసనలు, ధర్నాలు చేయాల్సిన అవసరం లేదు ఆపండి చాలు అని జిల్లా టిడిపి అధ్యక్షులు, రాష్ట్ర కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి ఎద్దేవా చేశారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో రు. 1.29 లక్షల కోట్లు విద్యుత్ మీదే అప్పులు చూపించి, 13 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా చేశారని విమర్శించారు. వారే తిరిగి పని పాటు లేకుండా రెండు రోజులుగా విద్యుత్ ఛార్జీలపై కార్యాలయాలు ముందు నిరసనలు తెలియజేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంకా వారు ఓటమి నుంచి తేలుకోలేదని, బయట విహారాలకి వెళ్లి కొన్నాళ్లు సేద తీరాలన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని విధంగా ఎన్నికల్లో వైసిపి పరాభవాన్ని చవిచూసిందన్నారు. రివర్స్ టండ్రింగ్ పేరుతో కమిషన్లకు కక్కుర్తి పడి 0 ప్రాజెక్టులను నాశనం చేశారని ధ్వజమెత్తారు. 6 నెలల్లో రాష్ట్రానికి ఎన్నో ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం తీసుకువచ్చింది అన్నారు. విశాఖలో టిసిఎస్ ప్రాజెక్టును ప్రారంభించడం జరిగింది, త్వరలో 70 వేల కోట్లతో అదానీ ప్రాజెక్టు, మెట్రో రైలు పనులు ప్రారంభం కానున్నాయన్నారు. వచ్చే ఏడాది చివరినాటికి భోగాపురం ఎయిర్పోర్ట్ పూర్తి కానున్నాయని తెలియజేశారు. మరోవైపు రోడ్ల పనులు, మరమ్మత్తులు ప్రారంభమైనాయని చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న ఇన్ని అభివృద్ధి పనులు వైసీపీ వాళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు నిరసనలు చేయడం కాదు ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని హితవు పలికారు. సమావేశంలో ఉత్తర నియోజకవర్గం టిడిపి నాయకులు వెల్లంకి భరత్ పాల్గొన్నారు.

చీమలపల్లి మర్రిచెరువు సమస్యను పరిష్కరించండి

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 95 వ వార్డు పరిధిలోని చీమలాపల్లి మర్రిచెరువు సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేవుడు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో రికార్డుల్లో సర్వేనెంబర్ 50గా నమోదైన మర్రిచెరువు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిప్యూటీ కలెక్టర్ సీతారామ్‌కు వారు వినతి పత్రం అందజేశారు. చీమలాపల్లి గ్రామం సర్వే నెంబర్ 50 లో సుమారుగా గత పాలకుల నుంచి పట్టాలు, 296 జీవో, హౌసింగ్ స్కీమ్ ద్వారా సుమారుగా 800 గడపతో ఈ ఊరు ఉందని, సర్వే నెంబర్ 50 రికార్డులో మర్రి చెరువు చూపించడం వలన ప్రభుత్వం నుంచి అందే అభివృద్ధి పనులు అనగా స్కూల్ బిల్డింగ్,అంగన్ వాడి బిల్డింగ్, ప్రజా ఆరోగ్య ఆసుపత్రి కట్టాలన్న, ఇల్లు కట్టుకోవడానికి ప్లాన్ పెట్టుకున్న రికార్డులో మర్రి చెరువు చూపించడం వల్ల అధికారులు వెనుక తిరగడం వలన ఈ గ్రామానికి ఏ పని అవటం లేదని, ఈ సర్వే నెంబర్ 50 మర్రి చెరువును తొలగించి సకాలంలో సమస్యను పరిష్కారించాలని డిప్యూటీ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి మండల రెవెన్యూ సిబ్బంది, డిప్యూటీ తహశీల్దార్ కిరణ్, గ్రామ పెద్దలు మాజీ ఎంపీటీసీ అయిత యెర్రయ్య, అయిత ఎర్నిబాబు, దువ్వి అప్పారావు, సబ్బవరపు ప్రకాష్, అయిత అప్పలరాజు, కంచిబోయిన వెంకట సంతోష్ పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని దగాచేసి... నీతులా జగన్

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ధ్వజం

విశాలాంధ్ర - భీమిలి : విద్యుత్ రంగాన్ని అతలాకుతలం చేసి చరిత్రలో ఏ ముఖ్యమంత్రి పెంచనన్ని సార్లు చార్జీలు పెంచి ధర్నాలు మీరే చేస్తారా..? జగన్ రెడ్డి అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రశ్నించారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి 6 నెలలకే ఎందుకు వైసిపీ నాయకులు విద్యుత్ రంగంపై ధర్నాలకు దిగారో సమాధానం చెప్పాలని అన్నారు. సైకో చేష్టలతో, తుగ్లక్ పాలనతో రాష్ట్ర ప్రజలను బెంబేలెత్తించి కంటిమీద కునుకు లేకుండా చేసిన మీరు చంద్రబాబు పాలన కోసం మాట్లాడే అర్హత ఉందో లేదో ఒక్కసారి మీ మనసాక్షికే తెలుసని అన్నారు. విద్యుత్ రంగంలో అపారమైన నష్టం చేశారని, 1,29,503 కోట్ల రూపాయలు నష్టం తెచ్చింది మీరు కాదా..? అని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నెత్తిన కుంపటి పెట్టిన మీరు మాట్లాడటం దెయ్యాలు వేదాలు అల్లినట్లు ఉందని అన్నారు. అధికారంలో ఉన్నంత కాలం కరెంటు కోతలు, చార్జీల మోతలతో అల్లాడించారని అన్నారు. అక్రమ విద్యుత్ కొనుగోలు, కక్ష సాధింపుతో పిపిఏ ల రద్దు, ట్రాన్స్ ఫార్మర్లు,స్మార్ట్ మీటర్లలో అవినీతి, బొగ్గు కొనుగోళ్లలో అవినీతి, ట్రూ అప్ చార్జీలంటూ కొత్తరకం బాదుడుతో చేసిన ఘనకార్యం చాలదా అన్నట్టు కొత్తనాటకాలు చేస్తున్నారని అన్నారు. ఇక ఆపండి మీ నాటకాలు అని అన్నారు. బాబాయ్ కి గొడ్డలి వేటు వేసేది నువ్వే.. దండ వేసేది నువ్వే ఇలాంటి రాజకీయాలు మాకు తెలియదు జగన్ రెడ్డి అని వ్యంగ్యంగా అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని పనికిమాలిన రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. తొందరపడొద్దు జగన్ ముందుంది ముసళ్ల పండగ అని గంటా నూకరాజు హెచ్చరించారు.

రైఫిల్ షూటింగ్‌లో ఎన్నారై మెడికల్ కాలేజీలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - తగరపువలస : డ్యాఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో జనవరి 8 నుంచి 18 2025 వరకు పంజాబ్ యూనివర్సిటీ, చండీగఢ్ లో నిర్వహించే ఆల్ ఇండియా అంతర విశ్వ విద్యాలయ ఛాంపియన్ షిప్ కోసం జట్టు ఎంపిక విశాఖపట్నంలో శుక్రవారం 27 .12 .2024 నాడు జరిగాయి. ఈ పోటీల్లో ఎన్నారైలో ఎంబిబిఎస్ మొదటిసంవత్సరం చదువుతున్న మెట్ట శ్రీముఖ రజిని మనోజ్ఞ, 10 మీటర్స్ ఎయిర్ ఫిస్టల్ (రైఫిల్ షూటింగ్)కి మరియు ఏఎస్ఆర్ హోమియోపతి కాలేజీలో తృతీయ సంవత్సరం చదువుతున్న వయ్యావుల ప్రవల్లిక, 10 మీటర్లు ఎయిర్ రైఫిల్ పోటీలకు ఎంపిక అయ్యారు. వీరిని ఎన్నారై కళాశాల డీన్ డా. పి.వీ. సుధాకర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.శివ ప్రసాద్ మరియు ఫీజికల్ డైరెక్టర్ ఆర్.గున్నాజీ అభినందించారు.

సొంత ఇల్లుని ఇప్పించమని ప్రభుత్వాన్ని వేడుకుంటున్న అవ్వ..

విశాలాంధ్ర - తగరపువలస : సంగివలస గ్రామానికి చెందిన ఊళ్ల నరసియ్యమ్మ తన సొంత ఇల్లుని కన్న కొడుకే తన నుండి తీసుకున్నాడని అందరి ముందు వాపోయింది. ఈమె తెలిపిన వివరాలు కింది విదంగా ఉన్నాయి.. సంగివలస గ్రామం, అనిట్స్ కాలేజ్ దరి సర్వే నెం 69/4 లో 12 సెంట్లు నందు నా భర్తగారు అయిన ఊళ్ల నరసింహులు, నేను (ఊళ్ల నరసియ్యమ్మ వయసు 80 సం?లు) సుమారు 40 సం?లు క్రితం మా కష్టార్జితంతో ఒక మంగుళూరు పెంకిటిళ్ళు నిర్మించుకొని నా భర్తగారు కాలం చేసిన తరువాత అదే ఇంట్లో ఉంటూ నేటికి ప్రభుత్వం ఇచ్చే నాలుగువేలు రూపాయలుతో ఒక్క దానినే ఎవరిపై ఆధారం పడకుండా వృద్ధాప్య భాదలతో జీవిస్తున్నాను. ఇది ఇలా ఉండగా ఒంటరిగా జీవిస్తున్నా నన్ను అలుసుగా తీసుకొని నా పెద్ద కొడుకు కుమారుడు ఊళ్ల వెంకట్(గతంలో ఆర్మీలో పని చేసి ఉన్నాడు) నాకు తెలియకుండానే ఏవో తప్పుడు పత్రాలు చూపించి నేను ఉంటున్న ఇల్లును అమ్మకం పెట్టి నన్ను ఇంటినుండి తరిమేయాలి అని చూస్తున్నాడు. అదే జరిగితే నన్ను ఆదరించే వాళ్లు చూసే వారే ఉండరు అని సదరు విషయాన్ని భీమిలి పోలీస్ వారికీ వ్రాత పూర్వకంగా తెలియజేసారు.

విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర - ఆనందపురం : జాతీయ మహిళా కమిషన జాతీయ న్యాయ సేవా ధికార సంస్థ మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో భీమిలి జిల్లా జడ్జ్ డి.సౌజన్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర స్థాయన్యాయ సంస్థ అధికారులు ఉచిత న్యాయ సలహాలు అందించారు. జిల్లా న్యాయ సంస్థ అధికారు లు ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చి చట్టపరమైన న్యాయం జరిగేలా సహాయపడతారు అని మహిళల పైన ఎన్నో జరుగుతున్న హింసలు గృహ హింస, లైంగిక పరమైన హింసలు ఎన్నో జరుగుతున్నాయి వాటికి ఎన్నో రకాల చట్టాలు మహిళల ను కాపడటానికి ఉన్నాయి. బయటకి వచ్చి న్యాయం కోసం పోరాడాలి మహిళలు చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియ చేసారు. చట్టాలపై అవగాహన చేశారు. అలాగే అడాప్షన్ దత్తత స్వీకారం ఎలా చేసుకోవాలి ఎన్ని రకాల దత్తత పద్ధతి ఉంటుంది అని ఇల్లీగల్ అక్రమము గా దత్తత తీసుకోకూడదు అని తెలియచేశారు అలాగే మహిళా రక్షణకు ఎన్ని రకాల సంరక్షణ గృహాలు స్వధార్ హెూమ్స్ కేజీహెచ్ కొత్త వన్ స్టాప్ సెంటర్ లు ఉన్నాయి వాటి పై అవగాహన చేశారు. అవాంఛిత గర్భం టీనేజ్ లో ఎక్కువగా ఉన్నాయి అరికట్టాలని సంతానాన్ని పారి వేయకండి శిశు గృహాల్లో అప్పచెప్పమని తెలియ చేసారు. మహిళలు మోసపోకూడదు బయటకు వచ్చి న్యాయం జరుపుకోవాలి అని తెలిపారు. నేషనల్ కమిషనర్ ఆఫ్ ఉమెన్ ప్రణాళిక ప్రకారం అవగాహన కార్యమాలు నిర్వహించేలా స్త్రీ శిశు సంక్షేమ శాఖ వారి తో చేయిస్తున్నారు అని చెప్పారు. సమస్య లు ఉంటే పరిష్కారం తెలియ చెయ్యగలం సలహాలు ఇస్తాము అని మహిళలకి సలహాలు సమస్యలకు ప్రాక్టికల్.గా ఇవ్వటం జరిగింది . ఈ కార్యక్రమంలో జిల్లా సిస్ సంక్షేమ శాఖ ఆఫీసర్ జయ దేవి, సిడి పిఓ శ్రీదేవి, ప్యానల్ లాయర్ అడ్వకేట్స్ స్వర్ణ గౌరీ, రవిశంకర్, ఏపిఎం రత్నం, ఉమా జానికి, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల కోసం సంస్థ ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 92 వ వార్డు పద్మనాభ నగర్ గ్రామంలో శ్రీ పద్మనాభ నగర్ అయ్యప్ప స్వామి పీఠం(రిజిస్టర్ నెంబర్ 734 ఆఫ్ 2024)అను స్వచ్ఛంద సంస్థ ప్రారంభించారు. ప్రతి సంవత్సరం అయ్యప్ప మాల వేసిన స్వాములకు ఈ సంస్థ ద్వారా పూజా కార్యక్రమాలు నిర్వహణలతో పాటు స్వాములకు భిక్ష మొదలగునవి ఏర్పాట్లు చేయడం. అలాగే కార్తీక మాసంలో స్థానిక ఆలయాల్లో స్వాములందరూ సేవా కార్యక్రమాలు నిర్వహించడం. అలాగే మిగిలిన సమయాల్లో గ్రామంలో స్వచ్ఛంద కార్యక్రమాలు లలో పాల్గొనాలని ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం, బ్లడ్ డొనేషన్ కార్యక్రమం, పరిసరాల పరిశుభ్రత వృద్ధులకు దివ్యాంగులకు చేయూతనందించడం తదితర కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా వారు నిర్ణయించుకున్నారు.కార్యవర్గ సభ్యులు గౌరవ అధ్యక్షులుగా: నందవరపు సోములు, అధ్యక్షులుగా: కంపర అప్పారావు, ఉపాధ్యక్షులుగా: కంపర నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా: సాలాపు గురుమూర్తి, సహాయ కార్యదర్శిగా :గంత కోరు అప్పారావు, కోశాధికారిగా: కంపర కనకరాజు, ఆర్గనైజర్ :కుప్పిలి లక్ష్మణరావు, సహాయ కోశాధికారిగా:కంపర రాము, సంయుక్త కార్యదర్శిగా సాలాపు శంకర్రావు, కల్చరల్ కార్యదర్శిగా: నందవరపు అప్పలరాజు, సబ్ ఆర్గనైజర్ గా బుర్రి పైడిరాజు తదితరులు ఎన్నికయ్యారి ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, స్వాములు పాల్గొన్నారు.

భాస్కర్ విద్యానికేతన్‌లో రతన్ టాటా సంస్మరణ సభ

విశాలాంధ్ర - పెదగంట్యాద : ఈరోజు 70వార్డు చట్టివానిపాలెం భాస్కర్ విద్యానికేతన్ పాఠశాలలో ఇటీవల స్వర్గస్తులయిన రతన్ టాటా యొక్క సంస్మరణ సభ నిర్వహించడం జరిగింది. ముందుగా పాఠశాల డైరెక్టర్ పాలవలస భాస్కరరావు రతన్ టాటా జీవిత చరిత్ర ను విద్యార్థులకు వివరించారు. ఆయన వ్యాపార సామ్రాజ్యం ఎలా విస్తరించారో వివరిస్తూ మన నిత్య జీవితంలో ఉపయోగిస్తున్న ప్రతీ వస్తువు టాటా గ్రూపు వారి ఉత్పాదనే అని, ప్రపంచదేశాలలో సుమారు 100దేశాల్లో విస్తరించి, 160దేశాలతో వ్యాపార సంభందాలు కలిగి ఉండడం గొప్ప విషయమని, ప్రతీ భారతీయుడు గర్వించదగ్గ అంశమని వివరించారు. అంతే కాకుండా కంపెనీ లాభాలు చాలా వరకు పనిచేసే సిబ్బందికి మరియు సామాజిక సేవాకార్యక్రమాలకు వెచ్చించిదం విశేషమని, అందకనే భారత ప్రభుత్వం అత్యున్నతమైన పద్మ భూషణ్, పద్మవిభూషణ్ వంటి పురస్కారలు అందించందని వివరించారు. విద్యార్థులంతా ఆయన జీవితం ను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో, కష్టపడి రానించి, సామాజిక స్పృహ కలిగి జీవించాలని సూచించారు. ఈ సందర్భంగా 8,9తరగతి విద్యార్థులు ఆయన జీవిత విశేషాలు తో కూడిన చార్టులు తయారు చేసి వివరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్కూల్ డైరెక్టర్ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమం స్కూల్ సిబ్బంది శిరీష, సునీతల ఆధ్యర్యంలో నిర్వహించగా విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకులకు స్వాగతం పలికిన సీపీఐ నాయకుడు శ్రీనివాసరావు

విశాలాంధ్ర - పెందుర్తి : విశాఖ జిల్లా మహాసభలో పాల్గొనేందుకు వచ్చిన సిపిఎం రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసరావు స్వాగతం పలికారు. శనివారం ఉదయం చిన ముసిడివాడ కూడలిలో ఆ పార్టీ నేతలకు స్వాగతం పలికిన శ్రీనివాసరావు సిపిఎం మహాసభలకు, సిపిఐ తరపున సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు ఐక్యంగా పోరాడాల్సి ఉందని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఎర్రదండు ఎల్లప్పుడూ పనిచేస్తుందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ప్రజా సమస్యలపై వామపక్షాలు కలిసి పనిచేస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పెందుర్తి శాఖ కార్యదర్శి ఎన్. అసిరి నాయుడు, అరుణ. అన్నపూర్ణ. అనురాధ, రజిని తదితరులు పాల్గొని వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి, ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

గొల్లవీధిలో నూతన విద్యుత్ ట్రాన్స్ఫారం ఏర్పాటు

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం పరిధి 61 వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో నూతన విద్యుత్ ట్రాన్స్ఫారం (100కే.వి) ఏర్పాటు చేయడం జరిగింది వార్డు తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ పాల్గొని ప్రారంభించి మాట్లాడుతూ స్థానికంగా నివాసం ఉండేవారు గత కొంతకాలంగా విద్యుత్ సరఫరా గ్రూపు తరచూ అంతరాయం ఏర్పడడంతో ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ అధికారులకు మరియు స్థానిక నాయకులకు తెలిపినప్పటికీ గత ప్రభుత్వం హయాంలో వారు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కాలేకపోయిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే గణబాబు ఈ. సమస్యపై తెల్పడంతో విద్యుత్ అధికారులతో సంప్రదించి ఈ ట్రాన్స్ఫార్మర్‌ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు స్థానిక టీడీపీ నాయకులు140 బూత్ కన్వీనర్ ఉరుకూటి మురళి చొరవతో ఈ పని సాధ్యమైందనే అన్నారు. ఈ కార్యక్రమంలో ఉరుకూటి పైడిరాజు, బర్ల కన్న, ఉరుకూటి సోమరాజు(చిన్న) పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు

విశాలాంధ్ర - పద్మనాభం : గంభీరం పంచాయితీ బోయపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ పదవ తరగతిలో బాగా చదివే ఉత్తమ విద్యార్థులకు విశ్వ భారత్ సంస్థ వారు నిర్వహించే ప్రతిభా పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు విశ్వభారత్ సంస్థ చైర్మన్ బలివాడ రమేష్ మెరిట్ సర్టిఫికెట్ 500 రూపాయల నగదుని బహుకరిస్తూ పాఠశాల అభివృద్ధి నిమిత్తం విరాళంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐవి కొండబాబుకి అందజేశారు. ఈ సందర్భంగా సమస్త చైర్మన్ రమేష్ మాట్లాడుతూ మేము ఇచ్చే కానుక చిన్నది కావచ్చు కానీ ఇది వారి ఉన్నత విద్యాభ్యాసానికి ఓ మంచి ప్రోత్సాహం అని భావిస్తున్నామని సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మధురవాడ బ్రాంచ్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.గౌరేశ్వరమ్మ, బోయపాలెం ప్రధానో పాధ్యాయులు ఐవి.కొండబాబు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ చల్లా రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విశ్వభారత్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సోషల్ ఆడిట్

విశాలాంధ్ర - పద్మనాభం : పెద్దిపాలెం గ్రామంలో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కి సంబంధించి మధ్యాహ్నం గ్రామ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ అధికారులు మరియు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మరియు బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు మరియు గుడిలోవ నీటి సంఘం వైస్ చైర్మన్ ముదిలి చిన్నయ్య పాత్రుడు పాల్గొన్నారు. నిధుల వినియోగంతో పాటు పనుల్లో పారదర్శకతకు ప్రతి పంచాయతీలోనూ ఏటా సామాజిక తనిఖీలు చేస్తుంటారని ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఎ.తిరుమలరావు, టి.ఎ ఓ.సత్య, ఫీల్డ్ అసిస్టెంట్ పల్లి శివ, ఆడిట్ డిఆర్పి బి.రాజు పంచాయతీ ఇంజనీర్ నాగరాజు, మేట్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గ్లోబెల్ స్కూల్ వార్షికోత్సవం

విశాలాంధ్ర - కొమ్మది : జీవీఎంసీ పరిధిలో అయోధ్యనగర్‌లో గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వినాయకుని స్తుతిస్తూ ప్రారంభించిన నృత్యం ఆకట్టుకుంది. తదుపరి ఎల్ కే జి చిన్నారులు తమ ప్రదర్శనతో నృత్యాలు ప్రారంభించగా అన్ని తరగతుల విద్యార్థులు వారి వారి ప్రదర్శనలతో విచ్చేసిన అతిథులను, తల్లిదండ్రులను అలరించారు. అనంతరం పాఠశాల చైర్మన్ బి.వి.రావు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, ఆట పాటలకు ప్రాధాన్యత ఉంటుందని, తమ విద్యార్థులు వివిధ స్కూల్ లలో జరిగే పోటీలు,మరియు అన్ని రంగాలలో ప్రతిభ కనబరచి స్కూల్ ను మంచి గుర్తింపు తెస్తున్నారని తెలియచేసారు. ఈ కార్యక్ర మములో కారస్పాండెంట్ అనురాధ, ప్రిన్సిపాల్ లలిత బోధనా సిబ్బంది,మరియు విద్యార్థి తల్లి తండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవజీవన్‌లో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

విశాలాంధ్ర - తగరపువలస : భీమిలి మండలంలోని గల దొరతోట వద్ద వున్న నవజీవన్ పబ్లిక్ స్కూల్లో శనివారం టెన్త్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. టెన్త్ బ్యాచ్ అంతా కలుసుకొని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమానికి వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పూర్వపు విద్యార్థిగా హాజరై మాట్లా దారు. చిరకాల మిత్రులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆటపాటలతో ఒకప్పుడు గడిపిన బాల్యాన్ని గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న తన తోటి స్నేహితులకు శుభాశీస్సులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ హెలెన్ జాన్సన్ టైటస్, అడ్మినిస్ట్రేటర్ శ్యామ్ కే. థామస్, సీఈఓ లీ. ఎలిజబెత్ శ్యామ్ లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలను సక్రమంగా అమలు చేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతం మల్కాపురం ఐటీసీ పెట్రోల్ బంకు వద్ద ఇండియా నుండి గాజువాక వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని విఐసిఎల్‌యు వ్యవస్థాపకులు దేవర అప్పలరాజు ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నెలకొన్న పరిశ్ర మలలో కార్మిక చట్టాలను అమలు చేయ డం ద్వారానే కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరుగుతుందని, ప్రతీ కాంట్రాక్టు కార్మికుడు చట్టాలపై అవగాహన మరియు పరిరక్షణకు కృషి చేయాలని, పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు పెత్తందారీ వ్యవస్థ కుట్రలు చేస్తు న్నారని, కాంట్రాక్టు కార్మికులు మరియు కార్మిక సంఘాలు సంఘిటిత మవ్వాల్సిన. పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పెద్దాడ గిరీష్, ఆమిశెట్టి వెంకటేష్, ముసిలి నాయుడు, త్రీనాదు, మోహన్, నాయుడు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యూజీనిక్స్ హేర్‌సైన్సెస్ నన్ను యంగ్‌గా మార్చేసింది : బోనీకపూర్

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఇండియాలోని ప్రముఖ హెయిర్ రెస్టోరేషన్ క్లినిక్ అయిన యూజీనిక్స్ హేర్ సైన్సెస్, ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి, అందులో బాలీవుడ్ నటుడు బోనీకపూర్ తన అద్భుతమైన హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ ప్రయాణం గురించి పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో యూజీనిక్స్ క్లినిక్‌ను స్థాపించిన డాక్టర్ ప్రదీప్ సేథీ, డాక్టర్ ఆరికా బన్సాల్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అధిక హిట్ అయిన హెయిర్ ట్రాన్స్ ప్లాంట్ సాంకేతికతలు, వాటి ప్రభావం గురించి చర్చించింది. బోనీకపూర్ తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకుంటూ, "సెల్ఫ్-కేర్, ఆత్మవిశ్వాసం అనేవి చాలా విలువైనవి. ఈ హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్ తన రూపాన్ని పునరుజ్జీవితం చేసింది. నా ఆత్మాభిమానం సరికొత్తగా మెరుగుపడిరది. నేను ఇంకా యంగర్, కాన్ఫిడెంట్‌గా ఫీలవుతున్నాను' అని అన్నారు.

జనవరి ఒకటి నుండి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

అతిక్రమిస్తే చట్టబద్ధమైన చర్యలు
నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జీవీఎంసీ పరిధిలో జనవరి 1వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించడమైనదని నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. శనివారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి సంపత్ కుమార్ తో కలసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై ప్రత్యామ్నాయాలు మరియు ఇన్స్ పెక్షన్ సిద్ధాంతాలుపై స్కిల్ అప్ గ్రేడేషన్ ట్రైనింగ్ ప్రొగ్రామ్ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్, జోనల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, శానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు, స్ట్రీట్ వెండర్స్, వర్తక, వ్యాపారస్తులుతో అలాగే అన్ని జోన్ల కార్యదర్శులతో జూమ్ యాప్ ద్వారా ప్లాస్టిక్ నిషేధముపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన మరియు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ యావత్ ప్రపంచాన్ని శాసిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని విశాఖ నగరం నుండి తరిమికొట్టాలని, ప్లాస్టిక్ పై గత ఐదు సంవత్సరాల నుండి ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్లాస్టిక్ భూమిలో కలవడానికి రెండు మూడు వందల సంవత్సరాలు పడుతుందని, మానవాళితోపాటు జల, చర జీవరాసులు కు ఎంతో హాని కలుగుతూ, తద్వారా కేన్సర్, భయంకర వ్యాధులు సంభవిస్తున్నాయన్నారు. కలుగుతుందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బదులు ప్రత్యమ్నాయ వస్తువులు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించాలన్నారు. అందుకు తగిన విధంగా మార్కెట్లు, రైతు బజార్లు, పళ్ళ దుకాణాలు వద్ద అవగాహన కార్యక్రమాలు మరియు ప్రత్యామ్నాయ వస్తువుల స్టాల్స్ ను ఏర్పాటు చేస్తున్నామని మేయర్ తెలిపారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ జనవరి ఒకటవ తేదీ నుండి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ల లోపువున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నిషేధించండం జరిగిందని, అతిక్రమించి జనవరి 1వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడిన దుకాణాల నుండి అపరాధ రుసుముతో పాటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు ఇప్పటికే ప్రజలకు 45 రోజుల పాటు అవగాహన కార్యక్రమం చేపట్టమన్నారు. ప్రతి వ్యాపారస్తునికి డిసెంబర్ 30వ తేదీలోగా నోటీసులు జివిఎంసి అధికారులు అందిస్తారన్నారు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడుతున్న చిన్నచిన్న వ్యాపారస్తులకు మొదటిసారి 2500, రెండోసారి 5000 తోపాటు వారి ట్రేడ్ లైసెన్సును రద్దు పరచడం జరుగుతుందని, అలాగే జీఎస్టీ పరిధిలో ఉన్న పెద్ద వ్యాపారస్తులు మొదటిసారి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, సరఫరా చేసినా, వినియోగించినా, తయారు చేసినా వారికి మొదటిసారి పట్టుబడితే 20 వేల రూపాయలు, రెండవసారి 40 వేల రూపాయలు అపరాధ రుసుముతో పాటు వారి యొక్క అన్ని వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జోనల్ స్థాయిలో జోనల్ అధికారులతో పాటు శానిటరీ సూపర్వైజర్లు, సానిటరీ ఇన్స్పెక్టర్లు అందరూ జనవరి ఒకటి నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఏ వ్యాపారస్తులు అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కమీషనరు ఆదేశించారు. అనంతరం సింగిల్ యూస్ ప్లాస్టిక్ పై జరుగు నష్టాలను, సంభవిస్తున్న వ్యాధులను కేజీహెచ్ చర్మ వ్యాధి వైద్యులు ప్రొపెసర్ రాజు, ఆంకాలజీ ప్రొపెసర్ కుమారి వివరించారు. అనంతరం సెంటర్ ఇన్స్ ట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ టెక్నాలజీ డైరెక్టరు మరియు హెడ్ డా.చంద్రశేఖర్ ప్లాస్టిక్ వస్తువులలో రకాలు, వాటి వలన కలిగే నష్టాలు, ప్లాస్టిక్ వస్తువులను గుర్తించే కోడ్ లను, వాటి వివరాలను పిపిటీ ద్వారా విపులంగా అందరికి వివరించారు.

కుసులువాడ మైనింగ్ అనుమతులపై ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర - ఆనందపురం : పర్యావరణానికి, ప్రజా ఆరోగ్యానికి హాని కలిగించే మైనింగ్ అనుమతులు పై శనివారం కుసులవాడ, చిన్నయపాలెం గ్రామస్తులు ప్రజాభిప్రాయ సేకరణలో చేశారు. ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ సర్వే నెంబరు 104 లో ఎద్దు మెట్టును మండల తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (హెచ్ సి ఎల్) సుధాసాగర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల సమక్షంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇరు ప్రాంతాల ప్రజలు వారి యొక్క అభిప్రాయాలను సంబంధిత అధికారులు తెలిపారు బ్లాస్టింగ్ తీసివేసి అనుమతులకు ప్రయత్నించడం సరికాదన్నారు. సముఖముగా ఉన్నామని చెప్పించడం ప్రజా వ్యతిరేక చర్యలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ ఎస్ ఎన్ మూర్తి పేర్కొన్నారు. ఒక్కసారి అనుమతులు వస్తే 20 ఏళ్ల వరకు ఈ పరిసర ప్రాంతాలు కాలుష్యకోరలు చిక్కుకుంటాయన్నారు. కాలుష్యకరమైన కంపెనీలకు అనుమతులు ఇచ్చిన తర్వాత ప్రజలు పలు అనారోగ్య పాలవుతారని అన్నారు. పర్యావరణానికి ప్రజలకు హాని కలిగించే మైనింగ్ అనుముతులను రద్దు చేయాలని కోరారు. చిన్నయ్య పాలెం దళిత యువకుడు భీమరాజ్ మాట్లాడుతూ సర్వే నెంబరు 104 లో మైనింగ్ పనులు చేపట్టినట్లయితే మొదటిగా నష్టపోయేది చిన్నయపాలెం గ్రామ ప్రజల అభిప్రాయాలను మాత్రమే పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలలో మైనింగ్ ఏర్పాటు చేయడం వల్ల కలిగే నష్టాలు, లాభాలను వివరించాలని ఇక్కడ మైనింగ్ చేపట్టడం వలన నష్టాలే అధికంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయంతో పాటు పశువులను జీవనోపాధి చేసుకుంటూ జీవనం గడిపుతూన్నామని మైనింగ్ పేరుతో పర్యావరణాన్ని పరిరక్షించాలని తెలిపారు. కుసులవాడ సర్పంచ్ భర్త మహంతి శివాజీ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణను పరిగణలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలన్నారు. కుసులవాడ నాయకులు శినగం దాము మాట్లాడుతూ ప్రజలకు హాని కలిగించే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలన్నారు. కుసులవాడ గ్రామస్తులు శినగం శ్రీనివాసరావు మాట్లాడుతూ కుసులవాడ పంచాయతీలు రైతులు పలు పంటలు వేసుకుని జీవనోపాధి పొందున్నా ప్రాంతంలో మైనింగ్ పేరుతో ధ్వంసం సృష్టించడం సరికాదన్నారు. మైనింగ్ సమీపంలో ఇండియన్ టిబెట్ బెటాలియన్,పోలీస్ బెటాలియన్, పలు లేఅవుట్, వన్యప్రాణులు ఉన్న అనేక విషయాల పట్టించుకోకుండా అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. ఈ మేరకు సుమారు 35 మంది స్థానికుల అభిప్రాయాలను అధికారులు రికార్డు చేసుకొగా ఎక్కువమంది అనుమతుల వద్దంటూ తన అభిప్రాయాలను వ్యక్తం ఇచ్చారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ సుధా సాగర్‌ప్రజల అభిప్రాయాలను పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నివేదికను అందజేసిన తర్వాత తెలియపరుస్తామన్నారు. ఈ సందర్భంగా చిన్నయ్య పాలెం ఇవ్వాపురం రేగాని గూడెం, కుసులవాడ గొల్లలపాలెం గ్రామస్తులందరూ పర్యావరణం కాకుండా చూడాలని తెలిపారు.

రోడ్డు నిర్మాణాలతో పల్లెలకు పండగ వచ్చింది

విశాలాంధ్ర - జలుమూరు : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమం ద్వారా పల్లెలకు రహదారి నిర్మాణం చేపట్టాలని లక్ష్యం ఈరోజు సంక్రాంతి పర్వదినం సందర్భంగా పల్లెలకు నిజమైన పండగ వచ్చిందని మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు బాహాటంగా అంటున్నారు. గతంలో రహదారి లేక ఏడు దశాబ్దాల కాలం అనేక కష్టాలు పడిన తమ గ్రామానికి నేడు పల్లె పండగ ద్వారా పంచాయతీరాజ్ శాఖ కూటమి ప్రభుత్వం పవన్ కళ్యాణ్ మంచి నిర్ణయంతో మారుమూలకొండ ప్రాంతాలైన సారవకోట మండలం కుమ్మరి గుంట పంచాయతీ సింగం వలస సోమయ్యపేట గిరిజన గ్రామాలకు పక్క తారు రోడ్డు నిర్మాణం జరగడం ఎంతో ఆనందదాయకంగా నిజమైన సంక్రాంతి మా గ్రామాలకు వచ్చిందని ఆ గిరిజన గ్రామం ప్రజలు బాహాటంగా అంటున్నారు.

వైజాగ్ క్రికెటర్ నితీష్ రెడ్డికి వీఎంఆర్డీఏ ఛైర్మన్ అభినందనలు

విశాలాంధ్ర - విశాఖ : మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియాపై విశాఖకు చెందిన నితీష్ రెడ్డి తొలి మ్యాచ్‌లో తొలి సెంచరీ సాధించడం అద్భుతమని వీఎంఆర్‌డిఏ చైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ కొనియాడారు. ఆస్ట్రేలియా గడ్డపై అతిపిన్న వయసులో సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడిగా రికార్డ్ సాధించడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. అద్భుతమైన బ్యాటింగ్?తో ఆస్ట్రేలియా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న నితిశ్ రెడ్డి ఆట తీరు క్రికెట్ అభిమానులను ఆకట్టుకుందని అన్నారు. ఫాలోఆన్ ప్రమాదంలో ఉన్న భారత్?ను అద్భుత శతకంతో ఆదుకొని చిరస్మరణీయ సెంచరీ సాధించిన నితీష్ రెడ్డి ఆట తీరు పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారు గర్విస్తున్నారని పేర్కొన్నారు. నితీష్ రెడ్డి భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని, భారత జట్టులో కొనసాగి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని, భవిష్యత్తులో మరిన్ని ఉత్తమ ప్రదర్శనలతో భారత జట్టుకు విజయాలు అందజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలియజేశారు.

సుజాతనగర్‌లో సీపీఎం జిల్లా మహా సభలు

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 97వ వార్డు, సుజాతనగర్ లో సిపిఎం 24వ మహాసభలు శనివారం అట్టహాసంగా ప్రారంభమైనాయి. ఉదయం పెందుర్తి కూడలి నుండి సుజాతనగర్ వరకు ఆ పార్టీ శ్రేణులతో పాటు వృద్ధులు విశ్రాంతి ఉద్యోగులు అభిమానులు ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీలో కోలాటం, కవాతు, వాయిద్యాలతో సిపిఎం కార్యకర్తలు ఎర్రజెండా చేత పట్టుకొని, స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేయరాదని నిత్యవసర వస్తువు ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ముఖ్యంగా కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికులు కర్షకులు బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు పాటుపడకుండా ఆదాని అంబానీలకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లోకనాథం నర్సింగరావు బి. జగన్, బి.రమణి తదితరులు ప్రసంగించారు.

ఐటీడీసీ-2024లో రెండో రోజు 33 నాట్య ప్రదర్శనలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : నగరంలో జరుగుతున్న ఐటీడీసీ-2024 కార్యక్రమంలో రెండో రోజైన శనివారం ఉత్సవాలను దేశం నలుచెరగుల నుంచి హాజరైన జాతీయ అంతర్జాతీయ నృత్యోత్సవ నిర్వహణా నిపుణులు సాయి వెంకటేష్, జగబంధు జెనా, కాశ్మీరా త్రివేదీ, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ కేశవరాజు బాలకృష్ణన్, డాక్టర్ పి. రమాదేవి, లాంఛనంగా జ్యోతి వెలిగించి ప్రారంభిచారు. అనంతరం ఆడిటోరియంలో నిర్వహించిన పోటీలకు డాక్టర్ సజని వల్లభనేని, కేశవ రాజు బాల కృష్ణన్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ప్రముఖ యువకూచిపూడి నర్తకీమణులుగా పేరొందిన బత్తిన సిస్టర్స్ తేజశ్రీ, భాగ్యశ్రీ ఈ పోటీలకు నిర్వాహకులుగా వ్యవహరించారు. కూచిపూడి, భరతనాట్య రీతులలో సీనియర్, జూనియర్, గ్రూప్, సోలో విభాగాలలో నిర్వహించిన ఈ పోటీలలో 33 మంది/బృందాలు తమ నైపుణ్యాలతో ప్రేక్షకుల్ని మైమరపించారు. సాయంకాలం పుష్ప గోదావరి, అరుణా పరమేష్, హర్షిత కొంపెల్ల, డా. రేఖా రాజు, డా. మల్లికా కందలి, రుమేలి ఘోష్, వై హనుమంత రావు, లోక చందరవేఖర్, దివ్య ఆనంద్, కారి వెంకట్, చింతా రవి బాల కృష్ణ, మధుమితా రావత్ బృందాలు, వ్యస్త నృత్యాంశాలు ప్రదర్శించారు. నిర్వాహకుల తరపున అతిథులు చేతులమీదుగా 16మంది ఐటీడీసీ-2024 అవార్డులు, ఒకరు ఐటీడీసీ యంగ్ ఎఛీవర్ ఇంకొకరు ఐటీడీసీ నాట్యభూషణ్ అవార్డులందుకున్నారు. ఐటీడీసీ ముఖ్య సలహాదారు వివి. రమణ మూర్తి, దేశం నలుచెరగుల నుంచి హాజరైన పలువురు నిష్ణాతులైన ఫెస్టివల్ డైరెక్టర్ల చేతులమీదుగా ఈ పురస్కారాలందజేశారు. విశేష సంఖ్యలో హాజరైన ప్రేక్షకులతో ఆడిటోరియంలో సందడ నెలకొంది.

రేపు ముగింపు ఉత్సవాలు

ఆ ఐటీడీసీ-2024 ముగింపు ఉత్సవం వుడా పార్కుకు ఆనుకొని ఉన్న ఎంజీఎం పార్కులో జరుగుతాయి. దాదాపు 1800మంది కళాకారులతో కనీవినీ ఎరుగని రీతిలో బ్రహ్మాంజలి మహా బృందనృత్యం ఆదివారం కార్యక్రమాలకు ప్రత్యేక ఆకర్షణ కానుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభాపతి (స్పీకర్) చింతకాయల అయ్యన్న పాత్రుడు ముఖ్య అతిథిగా, రాష్ట్ర సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ గౌరవ అతిథిగా హాజరై మూడురోజుల కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రముఖుల్ని, కళాకారుల్ని నిర్వాహకుల తరపున సత్కరిస్తారు. ఆ తర్వాత అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు వివరించారు.